
కథ

# మహాప్రస్థానం

— ఐతా చంద్రయ్య




"అమ్మ దొంగా... ఇదేమి తెగులూ?"

పిల్లల భోజనాలై బడి కెళ్ళిం తర్వాత ఇల్లు సర్దేస్తుంటే పిల్లిలా వెనకనుంచి వచ్చి ఒక చేత్తో కలువ కళ్ళను మూసేసి, మరో చేత్తో కౌగిట్లో బంధించిన కాంతారావును కమ్మగా మందలించింది అరుంధతి.

కాంతారావు ఉత్సాహం రెట్టిపైంది.

"అబ్బా! వట్టవగలు, తలుపులు తెరిచే ఉన్నాయి. సిగ్గు లేదూ?" చేతులున్న చీపురుకట్ట దూరం విసిరేసి భర్త నుండి విడిపోయే ప్రయత్నం చేస్తుంటే - అతని చెయ్యి బిగుసుకుపోతూంది.

"కనీసం కాజువల్లీవులు గూడా వాడుకోని కఠినాత్ముడని - తనతో పని చేసే గుమాస్తాలు [illegible]

మల్లెల హారాలై అతని కౌగిట వాలుతు న్నట్టనిపించింది.

ఉదయవు నీరెండలా తోసుకొచ్చే ఉత్సాహాన్ని ఒక్క తోపు తోసి బయటికి నడిచింది - వరండాలోకి.

"అరుందా... అరుందా... అరుంధతీ!" శూన్యంలోకి చేతులు చాచి గట్టిగా అరుస్తున్నాడు.

"ఏంటి మావయ్యా, అత్తయ్య గుర్తు కొచ్చిందా?" అంది కోడలు శార్వాణి కంగారుగా పరుగెత్తు కొచ్చి.

మంచం మీద కూచుండి గది కిటికీలోంచి బయటికి చూస్తున్న కాంతారావు కా పిలుపు వినబడలేదు. పెదవులు చప్పరిస్తున్నాడు.

"మావయ్యా... ఓ మావయ్యా!" మరింత గట్టిగా - చెవి వద్ద అరిచింది.

తాను ఉద్యోగంలోంచి తప్పుకోగానే - అరుంధతి తన జీవితంలోంచి తప్పుకుని కాళ్ళూ, చేతులు విరిచేసింది. పొద్దున లేవగానే టూత్‌పేస్టు అందించడం నుంచి, రాత్రి పడుకునే ముందు నీళ్ళందించే దాకా స్వయంగా చేసేది. ఇంట్లో ఉన్నంత తనను కంటికి రెప్పలా చూసుకునేది. అరుంధతి సేవల్లో తనకు అసౌకర్యమనే దేదీ కలగలేదు. రిటైర్ కాగానే ఇహ తాను గూడా రిటైరవాలనుకుందేమో - హాయిగా కన్ను మూసింది.

నలభయ్యేళ్ళ సుదీర్ఘ జీవనయానంలో తన తోడూ నీడగా నడిచిన అరుంధతి, పిల్లల పెళ్ళిళ్ళూ, కూతురూ, కోడళ్ళ కాన్పూలూ అన్నీ చూసి తన దారి తాను వెతుక్కుంది.

జీవన సంధ్యా సమయంలో ఒంటరి జీవితమెంత భయానకమో - అనుభవిస్తేనే తెలుస్తుంది.

రేప మొచ్చేది. కాని ఇరవయ్యేకటో శతాబ్దంలో అడుగు పెడుతూ కూడా గుమాస్తాలను కాల్చుకుతిన్న కాంతారావు, మానేజరు' అనే శీర్షికతో ఫైలాలజీలో తన పేర కొత్త అధ్యాయం రాస్తారేమో అనే భయ మేసింది. మచ్చ లేని తన సర్వీసులో నల్ల గీతలు పడతాయేమో అనే అనుమానమూ వచ్చింది.

వంట పని, ఇంటి పని, సరుకులు కొనే పనులు అన్నీ అరుంధతే చూసుకుంటుంది కాబట్టి తుమ్మితే, దగ్గితే సెలవు పెట్టే అలవాటు లేకున్నా - ముప్పయ్యేకటో డిసెంబర్ నాడు సెలవు పెట్టి ఇంట్లో ఉండిపోయాడు. ఆఫీసులో ఉన్న ఎ.సి. సౌకర్యం ఇంటిలో లేనందున ఎటూ తోచడం లేదు. చిలిపి కోరిక వెన్ను తట్టింది.

భర్త నుండి విడిపోవడం నిజానికి అరుంధతిగ్గూడా ఇష్టం లేదు. కాని ఎవరన్నా చూస్తారేమో నన్న సిగ్గు, భయం పెనుగులాడాయి. బలవంతంగా విడిపోయినా - కొంగు కాంతారావు చేతిలోనే ఉండిపోయింది.

ఎత్తైన గుండెలు, చేపల్లా కొట్టుకుంటున్న కళ్ళు, సిగ్గుల సింగారంతో ఎర్ర గులాబీలైన బుగ్గలు... ఆమె అందచందాలు స్ఫుటంగా కనబడుతున్నాయి.

పకాలున నవ్వింది. ఆ నవ్వులు విరబూసిన

"ఆఁ... ఏమ్మా...!" ఉలిక్కిపడి ఈ లోకంలో కొచ్చేశాడు.' తనెక్క డున్నాడో అర్థమైంది.

"మరైతే... అరుంధతి... అదే మీ అత్తయ్య... ఓహ్ అ దంతా గతం గదూ!"

"ఏమైంది మావయ్యా! చచ్చి ఏ లోకాన్నో ఉన్న అత్తయ్య నంత గట్టిగా పిలుస్తున్నారు. ఆ పిలుపు ఆవిడ విని దిగొస్తుందా? వయస్సు పైబడుతూంటే పిచ్చి ముదురుతుం దంటా రిందుకేనేమో!" కోడలి విసురులో ఎన్ని మందలింపు లున్నాయో!

"ఏం లేదమ్మా! ముప్పై సంవత్సరాల సంఘట నొకటి బుర్రలో మెదిలిం దంతే. అంతే నమ్మా. అంతే..."

అరవయ్యేళ్ళ కాంతారావు ఆరేళ్ళ కుర్రాడయాడు ముడుచుకుపోతూ.

కాంతారా వంటే నిఖార్సైన మనిషనీ, క్రమశిక్షణ తాను పాటిస్తూ, ఇతరులు పాటించా లంటాడనీ, పై అధికారుల ప్రశంసా హారాన్ని మెడలో ధరించి రిటై రయాడు - ఏడేళ్ళ క్రితం.

ముచ్చటగా ముగ్గురు పిల్ల లతనికి. పెద్దవాళ్ళిద్దరూ మగపిల్లలు, చిన్నది ఆడపిల్ల. అందరూ పెద్దవా రయారు. రోజుకు పదహారు గంటలు తను ఆఫీసును పట్టుకు వేలాడుతూంటే, అన్ని పనులూ చూసుకుంటూ, ఎవ్వరికీ ఏ లోటూ రాకుండా పెంచింది అరుంధతి.

ఒకరికి సుస్తీ చేస్తే ఇంకొకరు సేవ లందించడం, మూడో మనిషికి చెప్పలేని, చెప్పరాని విషయాలు చెప్పుకోవడం, కష్ట సుఖాల్ని సమంగా పంచుకోవడం... ఆహా దాంపత్య జీవితమెంత అపురూపం.

భర్త పోయి వైధవ్య మనుభవిస్తున్న స్త్రీకీ, భార్య పోయి వైపత్నీక మనుభవిస్తున్న పురుమడికీ లోకంలో మిగిలిం దేమిటి? కాంతారావు గుడ్లలో నీళ్ళు తిరిగాయి.

ఎప్పుడైనా భార్యను తలచుకుని బాధపడుతుంటే ఎందు కంత బాధని ఎవరైనా ప్రశ్నిస్తే "గుండెల్లో గూడు కట్టుకుని స్థిర నివాస మేర్పరచుకున్న భార్య రూప మెప్పుడూ హృదయం మీంచి చెరిగిపోదు అనుకుంటాడు తనలో తాను. పైకి మాత్రం ఓ నిర్వేదమైన నవ్వు అతని పెదవుల మీద మెరుస్తుంది.

అరుంధతి బ్రతికున్న రోజుల్లో కోడలికి పూర్తి విశ్రాంతి లభించేది. రెక్కలు దాచుకోకుండా పని చేసేది - కోడల్ని కూచోబెట్టి.

ఈ కోడలే కాదు, చిన్న కోడలి దగ్గరి కెళ్ళినా అంతే. ఆవిడైతే అత్తగా రొస్తే అటున్న పుల్ల ఇటు పెట్టేది కాదు. ఇక కూతు రింటికి వెళ్తే చెప్ప నవసరం లేదు. కూతురి అత్తగార్ని కూడా కూచోబెట్టి సేవ లందించాల్సి వచ్చేది. మనవలూ,

మనవరాండ్రను ఆడిస్తూ - వారి కన్నీ అమర్చి పెట్టేది. తన నెంతో గౌరవించేవా రందరూ.

మ రిప్పుడో? కొడుకూ, కోడలూ తనను గౌరవించే దొకే రోజు. అదే నెల మొదటి తారీఖు. పింఛను డబ్బులు వారి చేతుల్లో పడే దాకానే అది కూడాను. పింఛను రాళ్ళు వారి కప్పగించడం ఒక రోజు ఆలస్య మైతే చూడాల్సిందే కొడుకు ముభావం, కోడలి ధుమధుమలు - గుండెల్ని చీల్చేస్తాయి. కడుపు చించుకుంటే కాళ్ళ మీద పడుతుంది.

"ఈ ముస లాయన తెచ్చే ముష్టి మూడొందల యాభై రూపాయలక్క - గుదిబండలా తయా రయాడు. ఈయన పోయి అత్త య్యుంటే భేషుగ్గా ఉండేది."

కోడలు కొడుకుతో అంటుంటే వినబడిం దెన్నోసార్లు. పెళ్ళాం చేతిలో కీలుబొమ్మ. కొడుకు నోటికి తాళం పడింది. ఆత్మాభిమానం పొంగి రాజీ పడింది.

**భార్య పోగా ఒంటరివాడయిన అతగాడి కో కొడుక్కు. తన పింఛను డబ్బు మీదే తప్ప తన మీద ఎంతమాత్రమూ అభిమానం లేని కొడుకు, కోడళ్ళ మధ్య విసిగిపోయాడు. జీవన సంధ్యా సమయాన్ని గడపడానికి అత దే దారి నెన్నుకున్నాడు?**

"ప్రతి నెలా జేబు ఖర్చుకు వంద రూపాయలకు పైగా ఉంచుకుని ఏం చేస్తున్నావు నాన్నా?" అడిగా డోసారి భార్యా విధేయుడు.

కుత కుత లాడింది రక్తం. లాగి చెంప దెబ్బ వెయ్యా లనిపించింది.

"అధంతా నీ కనవసరం ఆ డబ్బు కూడా నీ పెళ్ళాం చేతిలో పోసి కాఫీ ఖర్చులకు చెయ్యి చాచాలా?" అన్నాడు.

కొడుకు తోక ముడుచుకున్నాడు.

కాని "పీనమెత్తు పంజెయ్య కున్నా-నెలకు నూటయాభై దండగ ఖర్చు..." కోడలి మూతి మూడొంకరలు తిరిగింది.

రెండో కొడుకు ఇంజనీరు. హైద్రాబాదులో నాలుగు చేతులా సంపాదిస్తున్నాడు. వెళ్ళేప్పుడు పిల్లలకు బిస్కెట్లు తీసికెళ్ళా డోసారి.

"తాతయ్యా తాతయ్యా" అంటూ చుట్టూ మూగారు పిల్లలు. మొదటిరోజు ఉల్లాసంగా గడిచింది-పిల్లలతో.

రెండోరోజు భోజనాల దగ్గర "నీ కొచ్చే పెన్షనంతా అన్నయ్యకే ఇస్తున్నావు నాన్నా!" అన్నాడు అర్థవంతంగా-రెండో కొడుకు.

"వాడిది చిరుద్యోగంరా. నేనూ వాడి దగ్గరే ఉంటున్నాను గదా! వాడికీ పిల్లలూ, సంసారమూ ఉన్నాయి పాపం!" అన్నాడు మనసులోని బాధను బయట పెట్టకుండా.

"అప్పుడు మీ వెంట మా అత్తగారొస్తే-నాకెంతో సాయంగా ఉండేది మావయ్యా!" అంది కోడలు-'నువ్వొస్తే మాకేం లాభం లే'దన్నట్టుగా.

మధ్యరాత్రి దగ్గుతెర వచ్చింది. గొంతు జీరబోయింది. వంటింట్లో ఏదెక్కడుందో తెలీదు.

కొడుకును లేపి, "కాసిని మంచినీళ్ళు కావాల్రా" అనడిగాడు.

ఇంజనీరు భార్యకు పురమాయించాడు.

"బంగారం లాంటి నిద్ర పాడైంది. అదే అత్తయ్యుంటేనా... అవిణ్ని మింగి ఈయన మిగిలాడు. ముదనష్టపు జాతకం!" వంటింట్లోంచి కోడలు గొణుక్కుంటూ రావడం-స్పష్టంగా వినబడింది. నీళ్ళగ్లాసు మంచం పక్కనుంచి విసురుగా వెళ్ళిపోయింది.

గాలి గడ్డకట్టుకు పోయిం దా క్షణం. చుట్టూ ఉన్న గోడలూ, పైకప్పూ కూలి మీద పడిపోయినట్టూ, చర్మ రంధ్రాల్లోంచి వేడిరక్తం బయటికి చిమ్మినట్టూ... కన్నీళ్ళు మంచినీళ్ళను తాకనివ్వలేదు.

"చూశావా అరుంధతీ! అదే నువ్వుంటే? నువ్వు లేనిలోటు ఎలా కొట్టొస్తుందో కనిపెట్టావా? మెదడు పొరల్లో మెదలిన భార్యముందు వెళ్ళబోసుకున్నాడు గోడంతా.

రాత్రంతా శివరాత్రైంది. మర్నాడే ప్రయాణం.

ఆర్నెల్ల క్రిత మోసారి అల్లుడొచ్చి రమ్మన్నాడు మనవరాలికి బారసాలని. కాంతారావు కూతురికది రెండో కాన్పు. మొదటి కాన్పు అరుంధతి చేతుల మీదుగా జరిగింది. కొడుకు పుట్టా డప్పుడు.

కూతురికీ, అల్లుడికీ, లోకంలో కళ్ళుతెరిచిన కొత్త మనవరాలికీ బట్టలు కొని పద్దు రాయించాడు.

చంటిదాన్ని తొట్టెలో వేశారు-ఆడంబరంగా మొట్టమొదట ఎవరన్నా పెద్దవారితో పాప పేరు పిలిపించి, ఆశీర్వాద మిప్పించాలి.

ముందు ఎవ్వరితో పిలిపించాలనే సమస్య తలెత్తింది. అల్లుడికి తల్లిదండ్రులు పోయా రప్పటికే.

"మా అమ్మ ఉంటే ఆవిడతోనే పిలిపించే వాళ్ళం. పోనీ... ఇప్పుడు మా నాన్నతో పిలిపిద్దా మండీ!" అంది కూతురు-భర్తతో.

"నీ కేమన్నా మతిపోయిందా? నువ్వూరుకో!" మొహం చిట్లించాడు అల్లుడు.

"ఏం...ఎందుకూ...?"

"మీ నాన్న వైధవ్య్నక మనుభవిస్తున్న సంగతి తెలీదా? శుభమాంటూ పాపపేరు పిలిపిద్దామంటే-ఒంటిజీవి చేత పిలిపిద్దామంటా వేమిటి? ఎవరన్నా ముసలిదంపతుల్ని చూద్దాం...!"

అల్లుని కరకుమాటలు కాంతారావు . సతలా కుతలం చేశాయి.

పదునైన కత్తితో గుండెను ముక్కలుగా కోసి కారం చల్లినట్లైంది.

మొదటి తారీఖున పింఛను తీసుకోగానే బట్టల పద్దు కట్టేసి మిగిలిన వంద రూపాయలు కోడలు చేతులో పెడ్తూ-

"మొన్న కూతురికీ, అల్లుడికీ గుడ్డలు తీసుకెళ్ళాను గదమ్మా● ఆ పద్దు కట్టేశాను..." అన్నాడు-సంజాయిషీ ఇస్తున్నట్టుగా.

కోడలి మొహం కోతిమూతి వర్ణమైంది. కళ్ళు చేటలైనాయి. కరకర నమిలి మింగెయ్యాలన్నట్టు చూస్తూ- "ఒంటి గాడితో పాపపేరు పిలిపించుకోని వారికి మీ రిచ్చిన బట్టలు పనికొచ్చా యన్నమాట! అయినా... మేం తీసికెళ్ళాం గదా, మీరుగూడా తీసుకెళ్ళకపోతే తలదీసి మొలేసేవా రా?" అంది.

రుసరుసలు, బుసబుసల స్థాయి పెరిగిం దా రోజునుండి.

"మా ఇంటి కళంతా మా అత్తగారి తోనే పోయింది".

"బ్రతికున్నా... ఆవిడనేం సుఖపెట్టేవా డీ ముసలాయనా?"

"జీవితమంతా ఈయనగారి సేవలతోనే సతమత మైం దావిడ."

"ఇప్పు డీయన గారికి సేవ లందించలేక నేను చస్తున్నాను."

"రాత్రింబవళ్ళు ఏదంటే అది అందించేందుకు- నే నేమన్నా కట్టుకున్న పెళ్ళాన్నా...?"

శార్వాణి సూటిపోటి మాటలతో గుండె తూట్లు పడింది. మనశ్శాంతి పూర్తిగా కరువైపోయింది.

మళ్ళీ మొదటి తారీఖొచ్చింది. శార్వాణి పెదాలమీద కృత్రిమ ఆప్యాయత కలబోసుకుంది. పొద్దున్నే కాఫీ టిఫిన్లందాయి-అడక్కముందే.

పింఛను కోసం వెళ్ళిన కాంతారావు తిరిగి రాలేదు.

పెద్ద కొడుకూ, కోడలూ కళ్ళల్లో వత్తులేసుకు చూశా రతని [డబ్బుల] కోసం.

మర్నాడు కూడా రాలేదు కాంతారావు, కాని అతని కొడుకు పేర ఓ ఉత్తర మందింది.

"బాబూ...

"నా కోసం ఎదురు చూస్తున్నారు గదూ! మీ అమ్మ చచ్చినప్పుడే నేను ముప్పాతిక చచ్చాను. నే నిక రాను. నా పింఛను డబ్బులు మీ కందవు. ఈ రోజు తీసుకున్న పింఛను డబ్బులు ప్రయాణం ఖర్చుల కుంచుకున్నాను. శేషజీవితం భగవన్నామ స్మరణతో, మీ అమ్మతో గడిపిన రోజుల్ని నెమరేసుకుంటూ ఏదో ఓ ఆశ్రమంలో గడిపేస్తాను. మీ అమ్మలేని జీవితం నాకు శూన్యంగా కనబడుతూంది.

"ఇకముందు నాకు పింఛను అక్కరలేదని రాసిచ్చాను ప్రభుత్వానికి. ఉంటాను.

ఇట్లు<br>
మీ నాన్న<br>
కాంతారావు.

*** *** ***